


అదొక మహాజన ప్రవాహం.

ఆనందోద్రేకాల కెరటాలతో నిండిన జన ప్రవాహం. సముద్రగర్భంలో నడయాడే తిమింగలాలు, మొసళ్లు, పాముల వలె ఎన్నో రకాల అవమానాలు, బాధలు, శంకలు గుండెలను కలచివేస్తున్నా, విముక్తి లభించిందన్న ఆనందంతో, మాతృభూమిని చేరుకుంటున్నామన్న సంతోషంతో అందరి ముఖాలలోను వెలుగు కెరటాలు ఊగిసలాడుతున్నయ్.

అందరిగుండెల్లోను ఏదో విషాదం.

కాని అందరి కళ్లల్లోను ఏదో ఆశ.

తమ గుండెల్లో కరడుకట్టిన చీకట్లును పారద్రోలే మహత్తరశక్తి ఏదో మాతృభూమిలో ఉన్నట్టు ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. అందు కేఆ ప్రయాణం, అందుకే ఆ ఆరాటం.

పీడకలలాటి భూతకాలాన్ని భారత దేశపు పొలిమేరలలోనే విడిచిపెట్టి, నిన్న మొన్ననే అవతరించిన సర్వస్వతంత్ర బంగ్లాదేశ్ లో సరిక్రొత్త జీవితాన్ని ప్రారంభించాలన్న కోరికతో అందరూ ముందుకు సాగిపోతున్నారు--ఏడెనిమిది నెలలుగా భారతదేశంలో తలదాచుకున్న బంగ్లాదేశ్ శరణార్థులు.

మాన రక్షణకోసం ప్రాణరక్షణకోసం యిల్లువిడిచి పారిపోయిననాటికి ఆమె పట్టుమని పదిరోజులుకూడా నిండని పెళ్ళికూతురు.

ఈ ఎనిమిది నెలలలోను తను జీవితంలోఉండే చీకటి కోణాలన్నిటినీ దర్శించింది. వక్రమార్గాల తీరుతెన్నులను పరిశీలించింది. మానవాకారాల్లో ఉండే మృగాలెన్నిటినో చూసింది. రక్తపు మడుగుల్లో నడచింది. కన్నీటి వాగులలో యీదులాడుతూ ప్రయాణం చేసింది.

ఆ అనుభవాలన్నీ తనని భౌతికంగా కఠినురాలినిచేసినయ్. కాని తన మనసు మాత్రం యిప్పటికీ వెన్నముద్దే. అది యీనాటికీ మధుర సౌరభాలను విరజిమ్ముతున్న విరజాజే!

తన మనసులోని ఆ మార్దవాన్ని, మాధుర్యాన్ని యిన్నాళ్లూ ఎవరికొరకు కాపాడుకుంటూ వస్తోందో అతనికోసమే తన యీ ప్రయాణం.

ఎన్నో అసహ్యకరమైన అనుభవాలను, దుర్భరమైన దారిద్ర్యాన్ని, రోగాలను, ఆకలిని తట్టుకుని నిలబడి యింకా ప్రాణాలతో తను మిగిలిఉన్నది తన ప్రియుడు, స్నేహితుడు, దైవం అయిన తన భర్తకోసమే!

ఎనిమిది నెలల్రకితం తన శరీరం బంగారు కాంతులను వెదజల్లుతూ ఉండేది.

అతను 'నీ శరీరకాంతిలోని తీక్షణ తను చూడలేక నా కళ్ళు చీకట్లు గ్రమ్ముతున్నయ్ సుమా' అనేవాడు.

'దేవాలయం ముందున్న కోనేట్లోని తామరపువ్వుల్లా ఎంత అందంగా, స్వచ్ఛంగా ఉంటయ్ నీ కళ్ళు?' అని ఆశ్చర్యపోయేవాడు అతను.

"నీ పొడుగాటి మెత్తని శిరోజాల మీద పడుకుంటే వేరే పరుపులెందుకు నాకు?" అనేవాడు కొంటెగా.

కాని యీనాడు తన శరీరంలో అతనిని ఆనందపరచే సౌందర్య చిహ్నలేమీ లేవు.

తైలసంస్కారంలేక తన శిరోజాలు బిరుసెక్కిపోయినయ్. చాలావరకు ఊడిపోయినయ్‌కూడా. స్నానపానాలు లేక తన శరీరం వన్నెతరిగింది. అరచేయి మందాన మట్టిపేరుకు ఉంది తన శరీరం. తన కళ్ళు కోనేటిలో తామరపువ్వుల్లా విశాలంగా ఉన్నా ఆనాటి పవిత్రత, మాధుర్యం యిప్పుడు లేవు.

ఐనా తన భర్త తనని చేరదీస్తాడన్న ధైర్యం తనకు ఉంది. తనలో శరీరాకర్షణ ఏమీ లేకపోయినా తనను ప్రేమిస్తాడన్న నమ్మకం ఉంది.

తన భర్త విద్యావంతుడు, వివేకి. 'శారీరక సౌందర్యం తాత్కాలికమైనది. అసలు శరీరమే అశాశ్వతం. కాని ఆత్మ మాత్రం శాశ్వతమైనది. ఆత్మసౌందర్యం చాలా అద్భుతమైనది' అని అతననగా తను ఎన్నిసార్లు విని పరవశించలేదు? అలాటి ఉత్తముడికి భార్యగా అవటం తనది ఎంత అదృష్టమో!

భర్తని గురించిన ఆలోచన రాగానే ఆమె మనశ్శరీరాలు రెండూ మధుర భావాలతో, భక్తి శ్రద్ధలతో పులకించిపోయినయ్. ఈ ఎనిమిదినెలలుగా అతను తనకోసం ఎంతగా పరితపించిపోయేడో! ఎంతగా విలపించేడో! తన కోసం ఎక్కడెక్క గాలించేడో! తను కనపడలేదని ఎంతగా కృంగిపోయేడో! తను చనిపోయేననుకుని ఎంతగా కుమిలిపోతున్నాడో!

బరువైన ఆమెగుండె ఎగసిపడి, కళ్ళలోకి కన్నీటిని చిమ్మింది. ఆ కన్నీరు ఆమె బుగ్గలమీదుగా కారుతుంటే తుడుచుకోవటానికి ప్రయత్నించకుండా అలాగే వెక్కివెక్కి ఏడవసాగింది.

ఆమె ఏడుపు విని కాబోలు ఎవరో మెల్లగా ఆమె బుజంమీద చెయ్యి వేసేరు. ఉలికిపడి చూసింది ఆమె.

"ఏడుస్తున్నావా? ఎందుకు? కన్నీళ్ళను, బాధలను కట్టగట్టి అవతల పారవేయవలసిన యీ సమయంలో కన్నీరెందుకు చెల్లీ?" అంది.

ఆమె ఒక ముస్లిం యువతి. మురికి బట్టలమధ్య మరింత ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్న ఆ ముస్లింయువతిసౌందర్యాన్ని, ఆమె ముఖంలోని నిబ్బరాన్ని చూసి అచ్చెరువొందింది ఆమె.

''నీ సంగతి వాళ్ళూ వీళ్ళూ చెప్పగా విన్నాను. ఇంక నాకంటే నువ్వే అదృష్టవంతురాలివి. నా కథ చెప్పనా?'' అంది.

ఆమెకి ఏం మాట్లాడాలో తోచక అలాగే కూర్చుని ఆమె వంకనే రెప్ప వాల్చకుండా చూసింది.

ఆ ముస్లిం యువతి ప్రారంభించింది. "నా పేరు అజీబ్. నా పేరుకు తగ్గట్టుగానే నా జీవితం కూడా చాలా చిత్రవిచిత్రంగా మారిపోయింది,'' అంటూ కారుమేఘాలమధ్య మెరుపు మెరసినట్లు అంతటి విషాదంలో కూడా తళుక్కుమనే నవ్వును నవ్వింది. ''నా అవతారం చూస్తే యిప్పుడు నేను అడుక్కుతినేదాన్లా ఉన్నాను, కదూ? కాని నేను ఢాకాలోని ఒక శ్రీమంతుడి ఏకైక పుత్రికనంటే నువ్వు నమ్మితావా?'' అన్నది అజీబ్.

ఆమె మరింత ఆశ్చర్యంగా, శ్రద్ధగా చూసింది అజీబ్‌వైపుకు. "నేను యిక్కడికి రాకముందు మెడిసిన్ విద్యార్థినిని. మార్చినెల మధ్యలో పరీక్షలు దగ్గరకు వస్తున్నాయన్న భయంతో శ్రద్ధగా చదువుకుంటున్నాం మేమందరం. ఉన్నట్లుండి అర్ధరాత్రివేళ మా హాస్టలు దరిదాపుల్లో బాంబులు ప్రేలిన శబ్దం వినిపించింది.

"అందరం భయంతో గడ్డకట్టుకుపోయేం. ఆ సమయంలో ఆప్రాంతంలో బాంబులెలా పేలినాయో, పోలీసులు ఏమయినారో ఏమీ తెలియలేదు మాకు.

హాస్టల్లో పనిచేసే ఒక నౌకరు పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పేడు. యాహ్యాఖాన్ తూర్పు బెంగాలులో బాంబులు వేసి సర్వనాశనం చెయ్యమని సైనికులకు ఆదేశించాడట. అందుకే వేల సంఖ్యలో యాహ్యాఖాన్ సైనికులు వచ్చి తూర్పు బెంగాలులోని పట్టణాలను, పల్లెలను విధ్వంసం చెయ్యటం ప్రారంభించేరు.

"ఆ విధ్వంసానికి వారుపయోగించిన సాధనాలు బాంబులు, తుపాకులు, టాంకులే కాదు. అంతకన్న భయానకమైన పాశవిక ప్రవృత్తిని వారు ప్రదర్శించసాగేరు.

"పంట పొలాలను, నిలువ నీడనిచ్చే యిళ్ళను విధ్వంసం చేయటంతో వారికి తృప్తి కలగక పరువంలో ఉన్న పడతు



లను, పసితనం వీడని బాలికలను, ఆఖరికి జవసత్వాలుడిగిన వృద్ధురాండ్రను కూడా తమలోని పశువాంఛలకు ఆహుతిచేయసాగేరు.

"మా హాస్టలంతా ఆ వార్త విని భయంతో దద్దరిల్లిపోయింది. క్షణంలో హాహాకారాలు మిన్నుముట్టినయ్. అందరూ ఏడుస్తూ, ఎదురుగాలేని తల్లిదండ్రులను గట్టిగా పిలుస్తూ అటూయిటూ పరుగెత్తసాగేరు. కొందరు గట్టిగా జట్టుపీక్కుని పెడబొబ్బలు పెట్టేరు. కొందరు భయంతో బిగుసుకుపోయేరు.

"బయట గందరగోళం, బాంబుల శబ్దం క్రమంగా పెద్దదవసాగింది. తలుపులు బ్రద్దలుకొట్టి, కనపడిన ఆడపిల్లనల్లా గదిలో నుండి బయటకు లాక్కువచ్చి నడిరోడ్డుమీద నలుగురైదుగురు కలసి అనుభవించేరు. ఆ అనుభవానికి తట్టుకోలేక కొందరు, ఆ దృశ్యాలను చూడలేక కొందరు అక్కడికక్కడే చనిపోయేరు. మరికొంద రమ్మాయిలు మూర్ఛపోయేరు. కొందరు ఎత్తయిన హాస్టలు మేడ అంచుకుపోయి, దానిమీద నుండి క్రిందికి దూకి ప్రాణాలను విడిచేరు. ఇంకా కొందరు, పమిట కొంగులతో మెడకు ఉరిబిగించుకొని చనిపోయేరు.

"అలాటి స్త్రీలందరి శీలసంపత్తికాని, దయనీయమైన స్థితికాని ఆ సైనికులలోని రాక్షస ప్రవృత్తిని మార్చలేకపోయినయ్. ఇంకా రెట్టించిన ఉత్సాహంతో ఆ స్త్రీల మానప్రాణాలను కొల్లగొట్టడం ప్రారంభించేరు.

ఆ హింసాకృత్యాలకు తట్టుకుని ప్రాణాలను కోల్పోకుండా మిగిలిన మొండిజీవులలో నేనొకదానిని. నేను చాలా అందంగా ఉంటానని ఢాకా నగరంలో నన్నెరిగిన వాళ్ళందరూ అనుకుంటూండే వాళ్ళు. ముఖ్యంగా మెడికల్ కాలేజీ విద్యార్థినీ విద్యార్థులంతా నన్ను 'నూర్జహాన్' అనీ 'విరగని చేతులుగల వీనస్ బొమ్మ' అనీ పిలుస్తుండేవాళ్ళు. శ్రీమంతుల యింట్లో పుట్టినా నా మనశ్శరీరాలు మాత్రం ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉండేవి.

"ఆ హాస్టలు ఆవరణలో పదిమంది నన్ను చెరచి, అంతటితో పూరుకోక స్పృహతప్పిపోయిన నన్ను వాళ్ళ శిబిరాలకు తీసుకుపోయేరు.

అక్కడ నాకు వైద్యం చేయించి, తమ ఆనందంకోసం నాకు ఆరోగ్యాన్ని ప్రసాదించేరు. ప్రతిరోజూ పగలనక, రాత్రనక నా చేత తప్ప తాగించి,

నగ్నంగా నాట్యం చెయ్యమనేవాళ్ళు. చెయ్యకపోతే తొడలమీద, రొమ్మున మీద తుపాకిమడమతో కొట్టేవాళ్ళు రోజుకొక శిబిరంలో నాట్యం చెయ్యటం, అక్కడున్న సైనికుల నందరినీ ఆనంద పరచటం నా కర్తవ్యమయిపోయింది. ఎప్పుడూ బ్రాందీ నిషాలో ఉండటంవల్ల వాళ్ళు శారీరకంగా నన్ను పెట్టేహింస నా మనసుని స్పృశించేది కాదు. అలా ఆరు నెలలపాటు తమ యిష్టం వచ్చి నట్లు నన్ను వాడుకుని చివరకు గర్భ వతినని గ్రహించి నన్ను నామానాన వది లేసేరు. నీరసించిన శరీరంతో, తడి యారిన గుండెతో ఉన్న నన్ను ఎవరో పుణ్యాత్ములు భారతదేశంలో తెచ్చి పడేసారు. శరణార్థులందరితోపాటు నేను కూడా పెట్టింది తిని, వైద్య సౌక ర్యాలు పొంది ఆరోగ్యవంతురాలి నయ్యేను. నా గర్భంలో పెరుగుతున్న మలినరక్తంతో కూడిన శిశువును హత మార్చి నా శరీరంలోని పాపచిహ్నాన్ని డాక్టర్లు తొలగించివేసేరు. కాని నా మనసులో వేరుకుపోయిన పగమాత్రం చావలేదు. నా జీవితాన్ని సర్వనాశనం చేసిన ఆ కిరాతక పాక్ సైనికులమీద నాకు గల ద్వేషం చల్లారలేదు.

"ఎలాగోలా ఆ శరణార్థుల శిబిరాల నుండి తప్పించుకుని తిరిగి తూర్పు బెంగాల్ చేరుకున్నాను. బంగ్లాదేశ్ వాలంటీర్లతో కలిసి రహస్య స్థావరాల్లో ఉంటూ పాక్ సైనికులను చాటుమాటుగా ముట్టడించి చంపేను. నా కంటికి కని పించిన పాక్ సైనికుడినల్లా చంపటమే కాక, చచ్చిన వాడి కాళ్లూ, చేతులూ వేటికవి విడదీసి ఆ మొండెంమీద ఉమ్మివేసేవరకు నాకు తృప్తి ఉండేది కాదు.

"మత ప్రాతిపదికమీద ఒకదేశాన్ని, జాతిని నిలపగలనని భావించేడు మతో న్మాదియైన యాహ్యాఖాన్. అతని నమ్మ కాన్ని నిలబెట్టే ప్రయత్నంలో అతని సైనికులు తమలో ఉన్న కనీసపు మాన వత్వాన్ని కూడా విస్మరించి, విశృంఖ లంగా ప్రవర్తించేరు. మతంకన్న మాన వత్వం గొప్పదని, ఆయుధ శక్తికన్న ప్రజాశక్తిబలమైనదనీ నిరూపించటానికి కంకణం కట్టుకున్న బంగ్లాదేశ్ వీరు లతోపాటు నేనుకూడా చేతనంత ప్రయత్నం చేసేను. మా ప్రయత్నా లకు భారతదేశపు సహాయం, భగవం తుని దయ అండగా నిలిచి మాకు విజ యాన్ని చేకూర్చినయ్. బంగ్లాదేశ్ కి నిరంకుశాధికారం నుండి విముక్తి లభిం చింది. వంగబంధు 'ముజ్‌బీర్ రెహ మాన్' అధ్యక్షతలో మనదేశం స్వాతం త్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని యిక తప్పకుండా కాపాడుకుంటుంది.

"మరి నా సంగతి ఏమయిందో తెలుసా? మా యింట్లో ఒక్క ప్రాణి కూడా మిగలకుండా పాక్ బాంబుల ప్రేలుడులో చనిపోయేరు. ఇల్లు, ఆస్తి అంతా ధ్వంసం అయిపోయినయ్. ప్రస్తుతం నాలో ఉన్న దొకే ఒక్క కోరిక. దేశంలోని పరిస్థితులు కుదుట బడిన తరువాత మెడిసిన్ చదువుని కొనసాగించి వైద్యురాలిగా స్థిరపడి పోతాను. నాలాగా మానవాధముల కిరాతక కృత్యాలకు బలియైన స్త్రీలకు సేవచేస్తూ నా జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాను" అంటూ ముగిం చింది అజీబ్.

ఆమె అజీబ్ వంక అప్రతిభురాలై చూస్తూ కూర్చుండిపోయింది. అజీబ్ ఏడుస్తుందేమో- ఆ నాటి సంఘటనలను తలచుకుని అనుకుంది.

కాని చిత్రం! అజీబ్ కళ్ళల్లో ఎంత మాత్రం తడిలేదు. ఆమె కళ్లు తీక్షణంగా చూస్తున్నాయ్. 'అజీబ్! నువ్వుసామాన్య యువతివి కావు' అనుకుంది ఆమె మనసులో.

ఇంతలో అజీబ్ ఎవరో పిలిస్తే వెళ్ళి పోయింది.

ఆమె మరల తన ఆలోచనలతో పడిపోయింది. అజీబ్‌లాగా సైనికుల చేతుల్లో చిక్కి గర్భవతులైన స్త్రీలు యిప్పుడు తనతోపాటు ప్రయాణం చేస్తున్న వాళ్ళల్లో చాలామంది ఉన్నారు. వాళ్ళల్లో చాలామంది ప్రాణాలెక్కడ పోతాయోనన్న భయంతోను, అక్రమ సంతానానికి తల్లులవబోతున్న తమ దీన స్థితికి సిగ్గుతోను, గర్భస్రావానికి అంగీ కరించలేదు. ఆ గర్భవతులలో కన్యలు, వివాహితలు, యువతులు, నడివయస్కు రాండ్రు అన్నిరకాలవారూ ఉన్నారు. ఊరు పేరు తెలియని కిరాతకుల సంతాన భారాన్ని మోస్తున్న యీ స్త్రీలను వారి తాలూకు బంధువులు, భర్తలు ఏ రకంగా ఆహ్వానిస్తారు? వారికి పుట్టబోయే సంతానంయొక్క భవిష్యత్తేమిటి? ఆ ఆలోచనలకే వళ్ళు గగుర్పొడిచింది ఆమెకు.

వాళ్ళందరితోను పోలిస్తే నిజంగా తాను అదృష్టవంతురాలే... ఆ రోజు... తను భర్తకౌగిలిలో వెచ్చగా నిదు రిస్తున్న సమయంలో ఫెళఫెళమంటూ తలుపులను బ్రద్దలు కొట్టుకుని లోపలికి వచ్చేరు యిద్దరు సైనికులు.

ఇంట్లో తామిద్దరూతప్ప మరెవ్వరూ లేరు.

లోపలికి వస్తూనే ఆ సైనికులిద్దరూ తనమీద పడ్డారు, తన భర్త ఉనికినే గమనించనట్లు. అది చూసి భర్త వాళ్ళ మీద కలియబడ్డాడు. ఒకడి చేతిలోని తుపాకితో అక్కడికక్కడే వాడిని కాల్చి చంపేడు. అది చూసి రెండవ వాడు తనని వదిలి ఆయన వెంటపడ్డాడు. దాంతో ఆయన బయటకు పరుగు తీసేడు.

ఆ సైనికుడికి పారిపోతున్న పురు షుడి ప్రాణంకన్న నిస్సహాయంగా నిల



బడిన స్త్రీ శీలమే ప్రియమైనదిగా తోచింది కాబోలు. తనని బలాత్కరించటానికి ప్రయత్నించేడు. తనుమాత్రం లొంగలేదు. శాయశక్తులా అతనితో కలియబడి శీలాన్ని కాపాడుకుంది. తన అరుపులు, ఏడుపులు విని బంగ్లావీరులు నలుగురు లోపలికివచ్చి ఆ కిరాతకుడిని హతమార్చి తనని కాపాడేరు.

చిరిగిపోయిన బట్టలతో, గాయాలతో కూడిన శరీరంతో నిస్సత్తువగా కూలబడిన తనని ఆ నలుగురు వీరులూ మోసుకుని సురక్షిత ప్రదేశానికి తీసుకుపోతుంటే అంతకు ముందు ఒక గంట క్రితం తన భర్త సమక్షంలోనే తన. శీలాన్ని చెరచటానికి ప్రయత్నించిన కిరాతకులు జ్ఞప్తికి వచ్చేరు తనకి. "ఓ మనిషీ! నీలోని రాక్షసత్వాన్ని చూసి నిన్ను నిందించనా? నీలోని దైవాన్ని చూసి నమస్కరించనా?'' అనుకుంది తను.

వీరెవరో తనకి తెలియదు. ఐనా తన భర్త వెంటలేకపోయినప్పటికీ తోటి మనిషిగా, స్త్రీగా తన నిస్సహాయతకు జాలిపడి తనని రక్షించటానికి ప్రయత్నిస్తున్నారు వీళ్లు. ఇంతటి దయామయులకు భగవంతుడు తప్పక సహాయం చేస్తాడు'' అనుకుంది తను మనసులో.

తనని మిగతా శరణార్థులతోపాటు కలిపి భారతదేశం పంపేరు. అక్కడికి చేరుకునేవరకు ఎన్నో గండాలు గడచినయ్. తీరా చేరుకున్న తరువాత కూడా తమని వక్రవిధి వెంటాడుతూనే ఉంది. ఒక పక్క సరియైన ఆహారం, నిలువ నీడా లేక కాందిశీకులందరూ అలమటిస్తుంటే వారి ప్రాణాల్ని ఎంత గట్టివో పరిశీలిద్దామా అన్నట్లు కలరా వ్యాధి తమ శిబిరాలలోకి ప్రవేశించింది. ఎన్ని వైద్యసౌకర్యాలు కల్పించినా రోజు రోజూ వందలమంది ప్రాణులు టపటప రాలిపోసాగేరు. తననికూడా ఆ వ్యాధి చేరదీయబోయిందిగాని అదృష్టం కొద్దీ బ్రతికి బయటపడ్డది.

నిముషాలు, గంటలు, రోజులు, నెలలు లెక్కపెడుతూ తన భర్తకోసం బ్రతికింది యిన్నాళ్ళూనూ. తన దేశానికి స్వాతంత్ర్యం లభించిందనీ, పరిస్థితులు చక్కబడినాయనీ విన్నది. ఇంక తనకు భయంలేదు. తన భర్త అనురాగాన్నుండి దూరమయ్యే అవసరం తనకింకలేదు.

నాలుగురోజులపాటు బస్సుల్లో, రైళ్ళలో, ఎడ్లబండ్లలో, కాలినడకన ప్రయాణంచేసి చివరకు తమ పల్లెను చేరుకుంది ఆమె.

తను పుట్టి పెరిగిన ఆ పల్లె, తనని ఒకింటిదానిని చేసిన ఆ పల్లెలోని ప్రతి మట్టికణాన్ని స్పృశించగానే ఆమె శరీరం పులకించిపోయింది.

అదిగో... ఆ గుడిసెల్లోని బోయీలే కదూ తనని పల్లకీలో మోసుకుని అత్త వారింటికి తీసుకువెళ్ళింది ... ఆ మెల్ల కన్ను పిల్ల గంగులిగారి మనమరాలు కదూ. ఏడాదికే ఎంత పెద్దదయింది! అదిగో! అటు కర్రపట్టుకుని వంగుని నడుస్తూ పోతున్నది ముఖర్జీ మహాశయుడు కదూ? ఆ ముసలి ప్రాణం యీనాటికీ యిన్ని భీభత్సాలను చూసి కూడా చలించలేదన్నమాట! ఆ మేలి ముసుగులోపల తలవంచి బిందె చంకన పెట్టుకుని పోతున్నది కరుణామయి కోడలు కదూ? ఆమె పెళ్లీ తన పెళ్లీ నాలుగు రోజుల తేడాతోనేగా అయింది? ... అదిగో ... అదే తమ యిల్లు...అబ్బ! ఆ నాటి సంఘటన తలచుకుంటే వళ్లు గగుర్పొడుస్తుంది. ఆ యింటిని వదిలి వెళ్తున్నప్పుడు యీ పరిసరాలన్నీ ఎంత భీభత్సంగా ఉన్నయ్! శాంతి, స్వాతంత్ర్యం తాండవ మాడుతున్న యీ రోజు ఆ పరిసరాలే ఎంత అందంగా ఆనందంగా కనపడు తున్నయ్! అయ్యో! ఆ యింట్లోకి నీళ్ళ బిందె మోసుకుపోతున్న ఆ యువతి ఎవరు? తన భర్త ఏమయ్యేడు? తనతో పాటు అతను కూడా యిల్లు విడిచి వెళ్లి పోయేడా? ఆ యింట్లో ఉన్నదెవరో, తన నెవరూ యింతవరకు గుర్తించ లేదు. బహుశా తన రూపంలో వచ్చిన మార్పే కావచ్చు దానికి కారణం... కాసేపు తన యింటి అరుగుమీదనే కూర్చుని ఆమె మళ్ళీ బయటకు వస్తే ''ఈ యింటివారు ఎక్కడున్నారు?'' అని అడగవచ్చు. అమ్మయ్య...అరె ఎవరు? ఎవరు? ఔను ఆయనే! ఆయనే! సందేహం లేదు.

''ఏమండీ!'' అంటూ ఇంట్లోనుండి బయటకు వచ్చిన యువకుడి కాళ్ళమీద వాలిపోయింది ఆమె.

అతను కాళ్ళు వెనక్కు తీసుకుని ''ఎవరు నువ్వు?'' అన్నాడు. ఆమె సంతోషాన్ని ఆపుకోలేక గట్టిగా ఏడ్చేస్తూ ''నేను...నేను...మీ...'' అంది మాటలు మింగుతూ.

''ఏమిటీ? నువ్వా? ఛీ...? ఎందుకు వచ్చావు? పో! బయటకు పో'' అన్నాడు కర్కశంగా.

''అయ్యో! అదేమిటీ? నేను మీ అర్ధాంగిని. నేనిప్పుడు ఎక్కడకు పోయేది? మీ కోసం...రోజొక యుగంగా గడుపుతూ...ఎదురుచూసి వస్తే ... చివరకి మీరు...నన్ను పొమ్మంటారా? నేనేం చేసేను చెప్పండి? నేను ఏం పాపం చేసేనని నన్ను పొమ్మంటున్నారు?" అంది ఏడుస్తూ.

"నువ్వు చేసిన పాపమేమిటో యింకా చెప్పాలా నా నోటితో? ఆ రోజు నా కళ్ల ఎదుటే వాళ్ళు నిన్ను ముట్టుకున్నారు. బలాత్కరించేరు. ఈ ఎనిమిది నెలల్లోను ఎంతమంది చేతులు మారేవో... ఎవరికి తెలుసు? ఇంకా ఆ రోజు నువ్వు చచ్చిపోయేవనుకున్నాను. బ్రతికే ఉన్నావన్నమాట! నా కళ్ళారా చూసేను. చెవులతో విన్నాను-నీలాటి స్త్రీలందరికి పట్టిన దుర్గతిని—అన్నీ తెలిసి నిన్ను ఏలుకోవటానికి నేనేం చవటనను కున్నావా? లేక మగసిరిలేని మగవాడి ననుకున్నావా?" అన్నాడు.

ఆ వాక్యాలు ఒక్కటొక్కటే ఆమె చెవులను సోకినంతనే ఆమె గుండె తునా తునకలైపోయింది. కాని ఆమెలో ఏమూలో మినుకు మినుకు మంటున్న జీవితేచ్ఛ ఆమెలోని ఆత్మాభిమానాన్ని చంపి, ఆతనిని ప్రాధేయపడేటట్లు చేసింది.

"నన్ను నమ్మండి. ఆ రోజు మీరు కళ్ళతోచూసింది మాత్రమే జరిగింది. మీరు పారిపోయేక రెండవసైనికుడితో కలియబడి, వాడి బారినుండి తప్పించు కున్నాను. నా కేకలు విని—మీరు పారి పోయినా — ఎవరో పుణ్యాత్ములు వచ్చి రక్షించి భారతదేశానికి వలసపోయే కాందిశీకులతోపాటు నన్ను కూడా పంపేరు. ఈ నాటివరకూ నేను శీలవతినే...నన్ను నమ్మండి. నేనే పాపమూ ఎరగను......" అంది కన్నీళతో అతని పాదాలను కడుగుతూ.

కాని ఆమె కన్నీళ్లు అతని రాతి గుండెను ఏమాత్రం కరిగించలేదు. 'ఆత్మ నిత్యం, శరీరం క్షణికం' అని చిలకపలుకులు పలికే అతనిలోని సంస్కారం తన అర్ధాంగి శరీరానికి అంటుకున్న యిసుమంత మలినాన్ని అంగీకరించలేకపోయింది. అంతేకాదు. నిష్కళంకమైన ఆమె ఆత్మ సౌందర్యాన్ని గుర్తించలేకపోయింది కూడాను. "ఏం...ఆ రోజు జరిగింది మాత్రం ఏం తక్కువని? నాకళ్ళముందే ఇద్దరు మగవాళ్లు నీశరీరాన్ని స్పృశించేరు. చూస్తూ చూస్తూ మైలపడిన ఆ శరీరాన్ని నేను మళ్ళీ ముట్టుకోగలనా? అందుకే నేను మళ్ళీ పెళ్లిచేసుకున్నాను. నేను తండ్రిని కాబోతున్నాను. తెలిసిందా? ఇంక యీయింట్లో నీకు ఒక్క క్షణం కూడా స్థానముండదు పో. ఏ పుణ్యాత్ములు నిన్ను రక్షించేరో...ఆ పుణ్యాత్ములపంచనే జీవించు. మాజోలికి మళ్ళీ రాకు" అన్నాడు.

అంతే! ఆమె కన్నీరు ఒక్కసారిగా గడ్డకట్టుకుపోయింది. తన శరీరాన్ని పరపురుషులు స్పృశించేరన్న నేరానికి తనని తిరస్కరించిన భర్త, ఏ చేతులతో ఒకప్పుడు తన శరీరంలోని అణువణువునూ స్పృశించేడో ఆ చేతులతోనే మరొక స్త్రీ శరీరాన్ని స్పృశించేడనీ, రాబోయే సంతానాన్ని ఆ చేతులతోనే పెంచి పెద్దచెయ్యబోతున్నాడనీ విన్న తరువాత—ఆ యింట్లో ఒక్క క్షణం కూడా తనకి స్థానం ఉండదన్న మాట నిజమే?

"శరీరం క్షణికమని తెలిసీ, స్త్రీల శారీరక పవిత్రతకు అధిక ప్రాధాన్యత నిచ్చే పురుషుల ఔదార్యానికి యివే నీరాజనాలు !... భగవాన్! నేను చేసిన నేరం ఏమిటి? స్త్రీఅయిపుట్టటమే నేరమా? లేక పతివ్రతల పుణ్యభూమిలో పుట్టటమే నేను చేసిన పాపమా? అవే నా నేరాలైతే...అందువల్లనే నాకీ దుస్థితి కలిగిందంటే......యీ పతివ్రతల గడ్డమీద స్త్రీగా జన్మించినందుకు నేను సిగ్గుపడుతున్నాను......" అంటూ గాలిలో తేలిపోతున్న ఆమె అంతర్వాణి ఘోషించింది.

*